# ఆ డ మ ళ యా ళ ం

"గోపీ"

"వస్తున్నా" అన్నాడు గదిలోనుంచి.

"ఇంకెంతసేపు? కారువచ్చి గంటసేపయింది. అబ్బా! పురుషులకున్న రోగమే ఇది. సింగారం...సింగారం... సింగారం...రోజంతా సింగారమే! పని తొందరా తెలియదు, పాడూ తెలియదు. గోపీ——గోపీ"

క్రాపు దువ్వుకునేటప్పటికి ఇంకోలతఃః. "కొంచెంసేపు ఆగలేవా?" అన్నాడు గదిలోనుంచి బయటికివస్తూ.

"ఆగలేను గోపీ, నీ అపూర్వసౌందర్యం నన్ను తన లోనికి గుంజుకుంటోంది. నీవు లేనప్పుడు నే ననుభవించే విరహ బాధ నన్ను భయపెడుతోంది. గోపీ, గోపీ, నీ సౌందర్యం నీకు తెలియదు. కాని...సౌందర్యం పురుషులు మెచ్చుకో లేరు, కాని..."

"చాల్లే, ఊరుకో"

ఎలిజా ముందు తా నొక స్త్రీనయి పోతున్నానని చీకాకు పడ్డాడు.

"ఊరుకోలేను గోపీ!"

"ఊరుకోవాలి ఎలిజా!"

"స్త్రీ హృదయ తంత్రులు అతి సున్నిత మైనవి." సీరియస్‌గా మొదలుపెట్టింది ఎలిజా. "అవి గాలి అలల రాపిడికే ప్రతిధ్వనిస్తాయి. కనుక దేనినీ ఓర్చుకొని ఊరుకో లేదామె"

గోపీ ఎలిజా కన్నులలోకి నవ్వి "పద పోదాము" అన్నాడు.

"ఆలస్యమైంది, కారెక్కి పోదాం."

"కారు నాగరిక ఘోషాపద్ధతి. సౌందర్యవతులకు కారెం దుకు? టిక్ టాక్ మంటూ బజారువెంట నడచిరాక" అన్నాడు గోపి.

"నేనయితే అంతే చేసేదాన్ని; కాని పురుషపుంగవుడవు నీవున్నావుగా! నీకోసమే కారు తెప్పించాను. వీథులలో తిరిగితే నీకు తప్పక దిష్టి తగులుతుంది. మళయాళీ స్త్రీల చూపులు పురుషుల అందాన్ని తమలోకి పీల్చుకుంటాయి. అమ్మో! నా గోపిని కారు లేకుండా పదిమంది చూపుల్లో పడేటట్లు నడిపిస్తానా నేను."

ఇద్దరూ కారు సమీపించారు. ఎలిజా డ్రైవరు సీటులో కూర్చుంది. ఆమె ప్రక్కనే కూర్చున్నాడు గోపి. కారు బయలు దేరింది.

"రాజుగారు జన్మిస్తే ఈరాద్ధాంత మెందుకు? జన్మించడం అనే ఘనకార్యం చేశాడనా? పోనీ మీ రాజుగారు జన్మించి నందుకు మీరు సంతోష పడాలిగాని మధ్య నాకెందుకు? నన్ను అనవసరంగా బయలుదేర దీశావు ఎలిజా, ఆ వస్తు ప్రదర్శనశాలకు నేనెందుకు చెప్పూ... చెప్పూ?"

"వస్తు ప్రదర్శనశాలంటే ఏమనుకున్నావు?"

"వస్తు ... ప్రదర్శన ... శాల అనుకున్నాను." అన్నాడు ముసిముసి నవ్వులతో.

"పిచ్చి తండ్రి, అక్కడే నీవు పొరపాటు పడ్డావు. వస్తు

ప్రదర్శనశాలంటే మళయాళంలో స్త్రీ ప్రదర్శనశాల అన్న మాట. ఈ పట్టణంలోని సుందరాంగు లందరూ అక్కడే ఉంటారు. సరకులు అమ్మేవారు, కొనేవారు, అందరూ స్త్రీలే! అటువంటి ఆనంద మందిరానికి నిన్నిప్పుడు తీసుకొని పోతున్నాను." అన్నది ఒకచేత్తో కారు నడుపుతూ రెండో చేతో హారన్ ఊదుతూ.

"ఆ సౌందర్యరాశిలోకి నేనెందుకు?"

"నాకోసం"

మొహం చిట్లించి, "నీకోసం నేనెందుకు?"

"తెలితారలకు వెలుగెందుకు? తలిరు పూవులకు తావి ఎందుకు? నీవు నాకందుకు."

"ఎలిజా! నీవు మళయాళం మాట్లాడుతున్నావు."

"మహాశయా సుతారంగా తప్పించుకున్నారు."

ఇద్దరూ ఒకరిని చూచి ఒకరు నవ్వుకున్నారు. కారు దారి తప్పింది.

ఆ స్త్రీలను చూచి గోపీ అదే స్వర్గ మనుకున్నాడు. ఆ సౌందర్యమును చూచి ముగ్ధుడైపోయినాడు ... ఎలిజా అతనిని ఆ ప్రదర్శనశాలలోని ప్రతిషాపూ తిప్పింది. ఇద్దరూ కలిసి కొన్ని వస్తువులు కొన్నారు. ఎలిజా కోటుగుడ్డా, షర్టుగుడ్డా, మరికొన్ని కొన్నది. గోపీ ఒక చీరే, జాకెట్టూ, కొన్నాడు.

"గోపీ, ఆచీరె, జాకెట్టు నీ కు బాగుంటాయి. ఏదీ ఆలోచించనియ్యి...అ జాకెట్టు తొడుక్కొని, ఆ చీరె కట్టుకొని—ఆహా గోపీ, ఎంత మనోహరంగా ఉంటావు!"

గోపీకి ఏమీా తోచక, "తమరు షర్టు తొడిగి కోటు వేసు కున్న దానికంటే బాగానే ఉంటాను. మళయాళీ స్త్రీల గూడకట్టు కంటే నాకీచీరె అనేక రెట్లు బాగుంటుంది. తమ రేమీా చెప్పనక్కరలేదు" అన్నాడు.

"అబ్బా, ఇంతలో ఉరుములు. ఇంతలో మెరుపులు. నీతో నేను వేగలేను గోపీ. ఇప్పుడు నేనన్నదానిలో తప్పే మున్నది? ఈ చీరె నీకు పసందుగా ఉంటుంది అన్నాను. ఎఱ్ఱనివాళ్లు నల్లచీరె కట్టుకుంటే మేఘావృతమైన చంద్రబింబం లాగుంటారు. ఆ సంగతి నీకూ తెలుసు. లేకపోతే ఇంత డబ్బు తగలవేసి ఆ చీరె ఎందుకు కొంటావు? ఆహా, ఈ చీరె నీకెంత బాగుంటుంది. నీకు కోపంవచ్చినా రాకపోయినా బాగానే ఉంటుంది. ఇంకా నా మాటలు నమ్మకపోతే ఆ అమ్మాయిని అడుగుదాం...'జేన్, ఇల్లారా?' అని ప్రక్క బట్టల షాపులో బేరం చేస్తున్న ఒక యువతిని పిలిచి గోపీ చేతిలోని చీరెను లాగి ఆమెకు చూపుతూ "ఈ చీరె ఈయ నకు అందంగా ఉండదా జేన్?" అన్నది.

ఆమె ఆ చీరెను చూచి, గోపీని నఖశిఖ పర్యంతముచూచి, "అద్భుతంగా ఉంటుంది. నేత్రానందంగా ఉంటుంది. మనో రంజకంగా ఉంటుంది." అన్నది.

గోపీ, జేన్ చూపులను భరించలేక, తలవాల్చి క్రిందకు చూస్తూ కాలి బ్రొటన వ్రేలిని భూమిలోకి గుచ్చుతున్నాడు.

"గోపీ. సిగ్గుపడకు. యదార్థమది." అని అన్నది లాలనగా.

"ఈ పురుషులకు సౌందర్యం కొద్దీ సిగ్గు." అని బుగ్గ పోటు పొడిచి క్రీగంట చూస్తూ వెళ్ళింది జేన్.

"గోపీ, ఇటు చూడు—ఏది ఒక్కసారి చూద్దూ—జేన్ పోయిందిలే! మా బాబుగా, ఒక్కసారి చూద్దూ! ఎంత చదువుకున్నా మీ జాతికి సిగ్గుపోదుగదా. పోదాం, రా" అని చేయపట్టుకుంది.

జేవురించిన మొహం పైకెత్తి "ఎక్కడికి? ఇంటికేనా?" అని అడిగాడు.

"ఏమంత తొందర? ఆనందమును భరించలేనంత దుర్బలుడవు గాదే నీవు. అనుభవించవలసినదంతా ముందున్నదోయి? ఇప్పుడే నీరస పడిపోకు."

"ఎలిజా, ఈ ఆనందం చాలునాకు. మహాతల్లీ, నన్నిలా బ్రతుకనివ్వు."

"ప్రాధేయ పడేవారిని చూస్తే స్త్రీకి పెత్తనం చేయుబుద్ధి అవుతుంది. ఎవరి యిష్టం వారిది. నీకు సంతోషమును ప్రసాదించే పనులు చేయడం నావంతు. వాటివల్ల సుఖమును పొందడం నీవంతు. కనుక టీ తీసుకుందాం. రా." అని గోపీ చేయి పట్టుకుంది.

"చిత్తము చిత్తము. చేయి వదలి వేయండి. వస్తాను." అన్నాడు, అతడు.

ఆ స్వర్గంలో అది నందనోద్యానం. అది "మధుర వేణు వీణాగాన మండితం." అది "వికచ మందారపుష్ప మరంద ఘుమఘుమప్లావితం." అప్సరసలవంటి స్త్రీలున్నారందులో. "గోపీ, ఎక్కడ కూర్చుందాం?" అన్నది ఎలిజా.

"ఎక్కడయినా సరే."

"అదీ తెలివి. ఎక్కడో కూర్చుని ఇంతకాఫీ గొంతులో పోసుకుంటే సరిపోతుందా? అయితే యింతదూర మెందుకూ? ఇంటివద్దే ఆ పని పూర్తిచేసుకోవచ్చే!...అదిగో ఆ బల్ల దగ్గర చూడు: ఆ అమ్మాయి సౌందర్యం. ఆ అమ్మాయి చేతికాఫీ, మిగిలినవాళ్ళు యిచ్చే కాఫీ ఒకేలాగుంటుందా? అక్కడకు పోదాం రా?"

గోపీ మాట్లాడకుండా ఆమె అడుగుల్లో అడుగులు వేస్తూ వెళ్ళాడు. ఆ గదిలోని స్త్రీలందరూ తన్ను వింతగా చూస్తున్నట్లు తెలిసికొన్నప్పుడు అతని అడుగులు తడబడ్డాయి. నెమ్మదిగా ఎలిజా ప్రక్కనున్న కుర్చీలోకి జారాడు.

"ఏమి కావాలో చెప్పు." అన్నది ఎలిజా.

"టీ తీసుకొని రండి." అన్నాడు గోపీ తననుచూస్తూ నిలబడిన ఆ సౌందర్యవతితో.

"మా ఇద్దరికి బ్రెడ్డూ, బట్టర్ తీసుకొని రండి." అన్నది ఎలిజా.

"నాకు అక్కరలేదండి. ఎవరి ఇష్టము వచ్చింది వారికి తీసుకొని రండి."

మారాముచేసే పిల్ల వానిని మందలించే తల్లివలే, "గోపీ!" అన్నది ఎలిజా.

"పాపం, వారిని బలవంత పెట్టకండి. పురుషులను మనం పువ్వులవలె వాడుకోవాలి. వారు సుకుమారులు." అన్నదా అమ్మాయి గోపీ బిక్కమొహంచూచి.

"మరేమీ పరవాలేదు. జాలి తలచకు. నీకెంత హక్కు

న్నదో.—బలవంత పెట్టుటకు—నాకంత హక్కున్నది.” అన్నది ఎలిజా నవ్వుతూ.

“అదా సంగతి!” అని అర్థముచేసుకున్నట్లు నవ్వి బ్రెడ్డు తీసుకొనిరావటానికి పోయింది.

“గోపీ! చూశావా, ఆ అమ్మాయి సౌందర్యం!”

“స్త్రీలకు సౌందర్యం ఉంటుందా! అది ప్రకృతి విరుద్ధం. స్త్రీలల్లో సౌకుమార్యపు నీడలు చూచి సౌందర్య మని భ్రమపడుతారు కొందరు. అసలు సౌందర్యం పురుషులదే.” అన్నాడు గోపీ.

ఆ సమయములోనే ఆమె చెరియొక ప్లేట్‌లో బ్రెడ్డు తెచ్చి వారిముందు ఉంచింది. ఎలిజా గోపీని చూపుతూ “చూశారా వీరేమంటున్నారో? మీరు సౌందర్య వతులు కారట, మీ సౌకుమార్యపు వెలుగునీడలు చూచి కొందరు సౌందర్యమని భ్రమపడుతున్నారట!”

గోపీ నోటిలో ఉంచుకోబోయిన బ్రెడ్డుముక్కను అలా చేత్తోపట్టుకుని నిర్ఘాంతపడి చూశాడు.

“పోనీ లెండి, పురుషులకు అంతవరకయినా తెలిసింది. అసలు సౌందర్యమనేది ప్రపంచంలో లేదని వాళ్ళ కింకా తెలియదు పాపం! నిన్న గాక మొన్ననేగా వాళ్ళ కళ్ళు తెరిచింది. అందులో ఈయన మరీ వింతగా ఉన్నాడు.” అన్నదా అమ్మాయి.

గోపీ హృదయం చీమల పుట్టవలె గుల గుల లాడింది. స్వర్గములో, కిల కిల నవ్వులతో, పుష్పాడి పూతలతో. అప్సర సల చేతులలో, ఉన్న మానవుని వలె అశోకవనంలో

రాక్షసులమధ్య రద్దీ రవ్వ సహించలేక విలపిస్తోన్న చిక్కబడిన కేశముల సీతామ్మవారివలె, సతుల మాయలు పన్ని, పాలిండ్లు పొంగారించుకొని, పై అంచుల్ మోవగ అధరం భాసించిన వధూధిని చేతులలో బడ్డ ప్రవరాఖ్యుని వలె, వెత జెందాడు. వాళ్ళిద్దరూ అతని అవస్థ చూచి పతివ్రతలను చూచి, అపహాస్యముచేసే రసికులవలె నవ్వారు.

టీ త్రాగి ఇద్దరూ బయలుదేరారు. ప్రదర్శనశాలను దాటి కారువైపుకు నడుస్తున్నారు.

"గోపీ, ఎట్లా ఉన్నది ఈ ప్రదర్శనశాల?" అన్నది ఎలిజా.

"నా మొహం లాగున్నది."

"అంత ఆకర్షణీయంగా ఉన్నదా? ఏ వస్తు వయినా నీ హృదయాన్ని అంతగా ఆకర్షించడము నేనోర్వలేను గోపీ!"

"ఎలిజా, నేనాంధ్రుడననీ, అవమానం సహించలేననీ..."

"సహించలేక ఏమి చేస్తావు?" అని అడిగింది గోపీకి ఎదురుగా వచ్చి నిలబడి.

"ఏమి చేస్తానా? ఏమి చేస్తానా? ఇదిగో ఇటు చూడు: కంఠమెత్తి, చేతులను చాచి ఏడుస్తాను."

"గోపీ, నా గోపీ!" అని ఎలిజా అతని తల తన భుజము మీద ఆనించుకొని, కేశములు సవరిస్తూ, తన సిల్కు చేతి రుమాలాతో కన్నీరు తుడుస్తూ, సముదాయిస్తూంది.

*